క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితుడికి సాయమందిస్తున్న వెంకన్నబాబు

కోరుకొండ (రాజానగరం): కోరుకొండలో అగ్ని ప్రమాదానికి గురై, ఉపాధిని కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన ముమ్మిడివరపు నరసింహమూర్తి కుటుంబానికి ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి, రాజమండ్రి రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ ప్రెసిడెంట్ మండలి వెంకన్నబాబు రూ.10,116లు ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని శుక్రవారం అందజేశారు. సప్లయ్ సామగ్రిని అద్దెకు ఇవ్వడంతో పాటు కాఫీ హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న నరసింహమూర్తి కుటుంబం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన సంగతి విదితమే.

ఎన్‌హెచ్‌పై వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు



బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజానగరం: జాతీయ రహదారిపై రెండు ప్రాంతాలలో ఫ్లెఓవర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించనున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చక్రద్వారబంధం, వెలుగుబంద గ్రామాల ప్రజలు తాము రాకపోకలు సాగించేందుకు పడుతున్న ఇబ్బందులను బీజేపీకి ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు ఇటీవల విన్నవించారు. దీనితో ఎన్‌హెచ్ విభాగానికి చెందిన అధికారులు ఎమ్మెల్సీతో కలిసి వచ్చి, ఆయా ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. పై రెండు గ్రామాలను కలుపుతూ ఫ్లెఓవర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ తెలిపారు.

నియామక పత్రం అందజేత



నాగబాబుకు ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ మందాలపు నాగలక్ష్మి మృతి చెందిన నేపథ్యంలో ఆమె భర్త పందెం నాగబాబుకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి కారుణ్య నియామక పత్రం అందజేశారు.

అనురాగ బంధనం

- ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్
- మార్కెట్‌ను ముంచెత్తిన రాఖీలు
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- నేడు రాఖీ పౌర్ణమి



బిక్కవోలులో అమ్మకానికి ఉంచిన రాఖీలు

బిక్కవోలు: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండగను శనివారం ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పండగలో కీలక పాత్ర పోషించే రాఖీలను గ్రామ గ్రామాన ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. తమ సోదరుల కోసం రాఖీలు కొనుగోలు చేసేందుకు వచ్చిన యువతులు, మహిళలతో అవి కిటకిటలాడుతున్నాయి. రాఖీ పండగకు పురాణ నేపథ్యం కూడా ఉంది. రాజుల కాలంలో యుద్ధానికి వెళ్లే వీరులకు భార్యలు వీరతిలకం దిద్దితే, విజయుడవై తిరిగి రావాలని ప్రార్థిస్తూ తోబుట్టువులు రక్షా బంధనం కట్టేవారని ప్రతీతి. కాలక్రమంలో ఈ పండగ ఉత్తరాది నుంచి దక్షిణాదికి వ్యాపించింది. స్థితి కారుడైన శ్రీహరి జన్మ నక్షతం శ్రవణం పూర్తిగా ఉండే ఈ శ్రావణ పూర్ణిమ రోజున మహిళలు తమ సోదరులకు రక్షాబంధనం కడతారు. గతంలో పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ రాఖీ పండగ కాలక్రమంలో పల్లెలకు విస్తరించింది. ఒకప్పుడు జంధ్యాల పౌర్ణమిగా పిలిచే ఈ పౌర్ణమి.. ఇప్పుడు రాఖీ పౌర్ణమిగా రూపాంతరం చెందింది.

వెరైటీ డిజైన్లు

అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని దాదాపు అన్ని దుకాణాల్లోనూ రాఖీలను విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయా ప్రాంతాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. సరికొత్త డిజైన్లలోని రాఖీలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పల్లెల్లో రూ.5 నుంచి రూ.100 విలువైన రాఖీలతో పాటు, అనపర్తి, పెదపూడి, జి.మామిడాడ, బిక్కవోలు తదితర పెద్ద గ్రామాల్లో రూ.5 నుంచి రూ.500 వరకూ విలువైన వాటిని విక్రయిస్తున్నారు.

స్వీట్ల దుకాణాల్లో రద్దీ

సోదరుడికి రాఖీ కట్టి స్వీటు తినిపించడం ఆనవాయితీ. దీంతో పాటు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు చెప్పుకుంటూ స్వీట్లు పంచుకుంటారు. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులతో స్వీట్ స్టాళ్లు రద్దీగా మారాయి.



సోదరులకు రాఖీ కడుతున్న తోబుట్టువులు (ఫైల్)

పది మంది తమ్ముళ్లకు రాఖీ కడతా



పది మంది అన్నదమ్ములకు ఒక్కదానే ఆడబిడ్డను. మా పెద్దనాన్న, పిన్నిల పిల్లలు, అన్నదమ్ములతో కలిపి మొత్తం 10 మంది సోదరులకు ప్రతి ఏడాది రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉంటుంది. ఈ ఏడాది కూడా ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నాను.

– గొర్రిపోటి సృజన, పందలపాక

రాఖీ ఓ ధైర్యం



ప్రతి ఏటా సోదరుడికి తప్పకుండా రాఖీ కడతాను. అన్నయ్య నాకు ఒక స్నేహితుడిగా ఉంటాడు. మా అన్నయ్యతో పాటు పిన్నిల పిల్లలకు కూడా రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉంటుంది. మనసుకు ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది.

– యానలవు త్రిపుర, పెదపూడి

అనురాగానికి ప్రతీక



తోబుట్టువుల అనురాగానికి ప్రతీక రాఖీ పండగ. మా అన్నయ్యకు ఏటా రాఖీ కడుతున్నాను. ఈ పండగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటాను. రాఖీ కడుతున్నప్పుడు మధురానుభూతి కలుగుతుంది. సోదరుడితో మంచి అనుబంధాన్ని కలిగిస్తుంది.

– జి.తిరుమలదేవి, పందలపాక

క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: పింఛన్ పంపిణీ తీరును పరిశీలించేందుకు కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శనివారం స్థానిక 49వ వార్డులో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని, వారికి సేవలందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మొదలైన పథకాలు అందలేదంటూ పలువురు ప్రజలు తెలిపారు. ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, వాటి యథార్థ స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్ఎంసి అధికారి శైలజావల్లి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, పీడీవోలు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వినాయక చవితి



ఇలపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్ర కుమార్

బిక్కవోలు: నిబంధనల ప్రకారం వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ అన్నారు. మండలంలోని ఇలపల్లి గ్రామస్తులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అశ్లీల కార్యక్రమాలు పెట్టకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏకో ఫ్రెండ్లీ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, ఐదు అడుగులకు మించి విగ్రహం ఎత్తు ఉండకూడదన్నారు. మైక్, కరెంటు అనుమతులు తీసుకోవాలన్నారు.

కూటమి నాయకుల అసత్య ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై విమర్శలు తగవు
- రాజకీయకక్షతోనే గుడిసెల తొలగింపు
- విలేకరులతో కుతుకులూరు బాధితులు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

అనపర్తి: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని లక్ష్యంగా చేసుకుని కుతుకులూరు ఎస్సీపేటకు సంబంధం లేని కొందరు కూటమి నాయకులు సమావేశాలు పెట్టి, అసత్యాలు చెబుతున్నారని ఆ ప్రాంత బాధితులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కుతుకులూరు ఎస్సీపేటలో గత 70 ఏళ్లలో ఇందిరాగాంధీ, ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. యాభై ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లలో కాపురాలు ఉంటున్న తమకు పిల్లల పెళ్లిళ్లు అయ్యి, కుటుంబ సభ్యులు పెరిగారన్నారు. దీంతో కొందరు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పట్టాలిచ్చిన స్థలంలోనూ, మరి కొందరు పశువుల పాకలు, గుడిసెలు వేసుకుని ఉంటున్నామన్నారు. అవి ఎవరికీ అడ్డు కూడా కాదని కావన్నారు. స్థానిక కూటమి నాయకులు రాజకీయ కక్షతో తమ గుడిసెలను కూల్చివేశారన్నారు. ఈ ఘటనతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి సంబంధం లేదని వారు చెబుతున్నారని, నిజంగా సంబంధం లేకపోతే ఇంత వరకు ఈ ప్రాంతానికి వచ్చి ఎందుకు బాధితులను పరామర్శించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు తెలియకుండానే సుమారు 10 మంది ఎస్సైలు, భారీగా పోలీసు సిబ్బంది, పంచాయతీ అధికారులు ఆగమేఘాలపై వచ్చి కూల్చివేశారా అని నిలదీశారు. తమ ఎస్సీ పేటకు సంబంధం లేని వ్యక్తులు ఈ ప్రాంతం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వారికి నిజంగా ఎస్సీ ఏరియా అభివృద్ధిపై శ్రద్ధే ఉంటే స్థానిక టీడీపీ నాయకులు రోడ్లని ఆక్రమించుకుని నిర్మించిన భవనాలు, షెడ్లను తొలగించాలన్నారు.

స్థానిక ఎన్నికలకూ భయపడుతున్న కూటమి

- జగన్‌కు ప్రజాదరణ పెరగడమే కారణం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి



అనపర్తి: మండల, గ్రామ స్థాయి ఎన్నికలు నిర్వహించడానికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం భయపడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి కూటమి నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. జగన్ మొన్న డోన్ నియోజకవర్గానికి ఓ పెళ్లి కోసం వెళితే ఎంత మంది వచ్చారో రాష్ట్రమంతా చూశారన్నారు. విశాఖపట్నం స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయం చూస్తే తిరిగి తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనడానికి చిహ్నమన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నిక చాలా చిన్న ఎన్నిక కావచ్చు, కానీ ఇచ్చిన సంకేతం మాత్రం చాలా పెద్దది అన్నారు. ఇలాంటి సంకేతాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయన్నారు. కాబట్టే నిన్న కొండెపిలో బలవంతంగా ఏకగ్రీవం అంటూ ప్రకటించుకున్నారు. కడప స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూడా అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని అధికార పార్టీ దౌర్జన్యం చేశారన్నారు. పులివెందుల జెడ్పీటీసీ కూడా వైఎస్సార్ సీపీకి పక్కాగా రావాల్సిన సీట న్నారు. రౌడీమూకలను పెట్టి విచ్చల విడిగా డబ్బు ఖర్చు పెట్టినా ఒక డీఐజీకి పచ్చ చొక్కా వేసి అక్కడ పెట్టినా జనం మాత్రం జై జగన్ అనే అంటున్నారన్నారు. అది తట్టుకోలేక నిన్న విచ్చలవిడిగా దాడులకు పాల్పడ్డారని, బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై ఏకంగా హత్యాయత్నం చేశారన్నారు. ఒక జెడ్పీటీసీ ఎన్నిక కోసం కూటమి ప్రభుత్వం ఇలా దిగజారిపోయిందన్నారు. పులివెందుల ఉప ఎన్నికల్లో టీడీపీ తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు



చినకొండేపూడి-2 లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ నవీన

సీతానగరం: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించడం జరిగిందని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ కె.నవీన తెలిపారు. శుక్రవారం చినకొండేపూడి - 2 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలు, వాటి నిర్వహణ గురించి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ వర్చువల్‌గా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ నవీన మాట్లాడుతూ ఈ ఆరోగ్య మందిరాల ద్వారా 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. ఎన్‌క్యూఏఎస్ నుంచి వారం రోజుల్లో చినకొండేపూడి-2 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ధ్రువీకరణ పత్రం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎం.శైలజా రాణి, టీమ్ మెంబర్ డాక్టర్ ఎస్ సుధలత, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.అరుణ, ఏఎన్ఎం రోజామణి, ఆశావర్కర్లు వి.కుమారి, రామసీత, ఆశాలత పాల్గొన్నారు.

'జానకి రాముల ప్రేమకథ' ప్రీమియర్ షో



ప్రీమియంషోను ప్రారంభిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నవరసాలు పలికించడంలో నటుడు నరవ గోపాలకృష్ణ సిద్ధహస్తులు అని వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యురాలు, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నరవ గోపాలకృష్ణ నిర్మాతగా, ప్రధాన పాత్రలో నటించిన 'రావణ లంకలో జానకి రాముల ప్రేమకథ' సినిమా ప్రీమియర్ షోను గురువారం రాత్రి రాజమహేంద్రవరంలోని సంహిత కల్యాణ మంటపంలో ప్రదర్శించారు. ఈ ప్రీమియర్ షోను జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరవ గోపాలకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరం నుంచి ఎందరో కళాకారులు, రచయితలు పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. గోదావరి నీరు తాగిన వారు కళా రంగాలలో రాణిస్తారన్నారు. తాను 20 ఏళ్ల వయసులో చిన్న నాటకాలలో ప్రదర్శనలు చేశానన్నారు. ఇక నుంచి పూర్తిస్థాయిలో నటనలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషిచేస్తానని అన్నారు. కథ, స్క్రీన్ ప్లే, దర్శకుడిగా విజయ్ పేరాపు వ్యవహరించారు. జానకి, రాముడిగా నటించిన యువజంట సినిమా పూర్తి అయ్యే సరికి ప్రేమలో పడ్డారని నిర్మాత నరవ గోపాలకృష్ణ తెలిపారు. ఈనెలలోనే వారు భార్యాభర్తలు కాబోతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లంక సత్యనారాయణ, రెడ్డి రాజు, బెజవాడ రంగారావు, గేడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో నగర క్రీడాకారుల సత్తా

- పలు పతకాల కైవసం
- జాతీయ పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్: నగర విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ముఖ్యంగా రోల్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి వాటిలో ప్రతిభ చూపి, పతకాలు సాధిస్తున్నారు. మన రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన 7వ ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో, 17 ప్లస్ పురుషుల విభాగంలో సత్తా చాటి కాంస్య పతకాలు సాధించారు. వీరిలో అత్యంత ప్రతిభ కనబరిచిన ధరహాస్, ప్రభాత్, వెనవీర్, రాయుడు, తరుణ్, రిషిక్, జితేంద్ర, విష్ణు, రిత్విక్, కళ్యాణ్, సిద్ధు, కేశవ, అశోక్ తిరుచ్చిలో జరిగే సౌత్ ఇండియా రోల్ బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. వీరందరికీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రుద్రశ్రీ మహస్వీ, కార్యదర్శి అప్పారావు అభినందించారు.

సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు మోహిత్

ఏపీ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో నగరానికి చెందిన కొత్తపల్లి శ్రీమోహిత్ మెన్స్ సింగిల్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి, సెప్టెంబర్‌లో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం గౌహతిలో శిక్షణ తీసుకుంటున్న శ్రీమోహిత్ నవంబర్‌లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

కానరాని శిక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతుల పేరుతో ఒక నెల రోజుల పాటు వివిధ క్రీడల్లో విద్యార్థులకు వారికి నచ్చే ఆటల్లో శిక్షణ ఇచ్చేవారు. వీటితో పాటు స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గత ప్రభుత్వం కృషి చేసింది. కాగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ తరగతులు తూతూమంత్రంగా నిర్వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా క్రీడల్లో రాణించడానికి పీడీలు, క్రీడా శిక్షకులు కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడంతో క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు.

వరలక్ష్మి.. నమోస్తుతే..



కొమరిపాలెంలో కనకదుర్గమ్మ



అనపర్తి శాంతిపురంలో అమ్మవారు



విశేష అలంకరణలో ఈలకొలను ముత్యాలమ్మ



సంపరలో 10,116 పసుపు కొమ్ములతో విజయదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ

- ఘనంగా సామూహిక వ్రతాలు
- కిటకిటలాడిన ఆలయాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

పెదపూడి: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మి దేవి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. జి.మామిడాడలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పూజలు చేశారు. సంపర గ్రామంలో ప్రముఖ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో విజయదుర్గ అమ్మవారికి 10,116 పసుపు కొమ్ములతో చీర కట్టి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెద్దాడ, రామేశ్వరం, కాండ్రేగుల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

ప్రత్యేక పూజలు

సీతానగరం: మండలంలోని కనకదుర్గమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగవరం నాగరత్నం కాలనీ వద్దగల కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, ఆలయ అర్చకులు యనమండ్ర గంగాధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతానగరంలోని శ్రీవరలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. వంగలపూడి, రామచంద్రపురం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, కూనవరం, చీపురపల్లి, నాగంపల్లి గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు.



జి.మామిడాడ సూర్యనారాయణమూర్తి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో..

అనపర్తి: గ్రామంలోని శాంతిపురంలో గల గణపతి సరస్వతీ సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు రామకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా ముత్యాలమ్మ

రంగంపేట: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈలకొలను గ్రామంలో కొలువైన ముత్యాలమ్మను పూలమాలలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా.. శనివారం సుమారు మూడు వేల మంది భక్తులకు ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

కుంకుమ పూజలు

బిక్కవోలు: మండలంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ, బలభద్రపురం సత్తెమ్మ, బిక్కవోలులోని పార్వతీదేవి, పందలపాకలోని కట్లమ్మ తల్లి, తొస్సిపూడి నవదుర్గమ్మ, ఊలపల్లిలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.